
నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL



# ఆగని దందా!

ఆధిపత్య పోరులో బయటపడుతున్న సమాచారం

ఇల్లు, ఒల్లు గుల్ల చేసుకుంటున్న కల్లుప్రియులు

- నడిగడ్డలో విచ్చలవిడిగా కల్తీ కల్లు తయారీ
- కోట్లకు పడగలెత్తిన విక్రయదారులు
- మూడురోజుల కిందట ఏకకాలంలో రైడింగ్
- దాడులు చేసే కొద్దీ లభ్యమవుతున్న మత్తు పదార్థాలు
- కల్లు తాగిన వారికి వైద్య పరీక్షలు..
- నిషేధిత మత్తు పదార్థాలు కలిపినట్లు గుర్తించిన అధికారులు
- 20 మందిపై కేసు నమోదు, 200 సీసాల కల్లు స్వాధీనం

గద్వాల, సెప్టెంబర్ 29 : నడిగడ్డలో అనుమతిలేని కల్లు దుకాణాలతో పాటు అనుమతి ఉన్న దుకాణాల్లో కల్తీ కల్లు తయారీ విచ్చల విడిగా సాగుతోంది. కల్లు తాగిన వారు ఇల్లు గుల్ల చేసుకుంటుండగా కల్లు తయారీ దారులు మాత్రం కోట్లకు పడగ లెత్తుతున్నారు. నడిగడ్డ కల్లు తయారీకి పేరెన్నికగన్నది. ఇక్కడ ఈత చెట్లు తక్కువగా ఉన్నా.. కల్లు మాత్రం విచ్చల విడిగా తయారవుతున్నది. కల్తీ కల్లు తయారీదారులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసే క్రమంలో రాజకీయ నాయకులు ఒత్తిళ్లతో కేసులు నమోదు కాకుండా చూడడంతో నడిగడ్డలో కల్తీ కల్లు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది.

***నడిగడ్డలో ఆధిపత్య పోరు..***

గద్వాల నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరు కొనసాగుతుంది. అయితే రెండు వర్గాలు ఒకరికి తెలియకుండా ఒకరు రాష్ట్రంలోని ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారులకు అపరిచితుల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తుండడంతో కల్తీకల్లు విక్రయదారులు హడ లెత్తుతున్నారు. మూడు నెలల కాలంలో మూడు సార్లు గద్వాల నియోజకవర్గంలోనే దాడులు చేయడం దాడులు చేసిన ప్రతిసారి నిషేధిత కల్లు దొరకడం జరుగుతున్నది. దీంతో ఏ స్థాయిలో కల్తీకల్లు ఇక్కడ తయారు చేస్తున్నారో తెలిసి పోతుంది.

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం..

కొన్నేండ్ల నుంచి రాజకీయ అండదండలతో నడిగడ్డలో కృత్రిమ కల్లు తయారు చేసి అమాయక ప్రజల ప్రాణాలతో కల్లు తయారీ దారులు చెలగాటమాడుతున్నారు. కల్తీకల్లు తయారీదారులు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. కల్లు తాగిన వారు మాత్రం తమ ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. ఈ విషయం అబ్కారీశాఖ అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం డ్రగ్స్ వాడకంపై కఠినంగా వ్యవహరిస్తుండడంతో నిషేధిత మత్తు మందుల సరఫరాదారుల వివరాలు బహిర్గతం అవుతున్నాయి. జూలైలో హైదరాబాద్‌లో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో గద్వాలలో కూడా మత్తు పదార్థాలతో కల్తీ కల్లు విక్రయిస్తున్నారని గుర్తించి దాడులు చేసినట్లు తెలుస్తున్నది. సాధారణంగా కల్లు తయారీకి సీహెచ్‌ను వినియోగిస్తారు. ప్రస్తుతం దీనిపై నిషేధం ఉన్నది. ఒక కిలో సీహెచ్‌తో 3 నుంచి నాలుగు కేసుల కల్లు తయారు చేసేందుకు వీలు ఉంటుండగా, కానీ అధికారుల దాడుల్లో బయట పడుతున్న నిషేధిత మత్తు మందు ఒక గ్రాముతో 35 నుంచి 40 కేసుల కల్లును తయారు చేయవచ్చని ఇది సీహెచ్ కొద్ది ఎక్కువగా మత్తు ఇస్తుండంతో దీనిని వినియోగించి కల్తీ కల్లు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రమాదమని తెలిసినా ధనార్జనే ధ్యేయంగా కల్లులో మత్తు పదార్థాలను కలుపుతూ తమ దందాను కల్లు తయారీ దారులు కొనసాగిస్తున్నారు. మల్దకల్ మండల కేంద్రంలో గత నెలలో నార్కోటెక్ డ్రగ్స్ అధికారులు దాడులు చేసి కల్లులో మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు గుర్తించి ముగ్గురుపై కేసులు నమోదు చేశారు. ఆగస్టు నెలలో ధరూర్ మండలం పాతపాలెం కల్లు డిపోలో సీహెచ్ లభ్యం కాగా కల్లు డిపో నడిపే వ్యక్తిపై ఆబ్కారీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఇక్కడ కల్లు విక్రయించే అధికార పార్టీ నేతపై గతంలో జడ్చర్ల, కర్నూల్, గద్వాల తదితర ప్రాంతాల్లో కేసులు నమోదైనప్పటికీ తనకున్న రాజకీయ పలుకుబడితో ఈ దందాను కొనసాగిస్తున్నాడని తెలుసున్నది. ఈ నెల 27న నార్కోటెక్ అధికారులు కేసులు నమోదు చేయగా అసలు సూత్రదారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికైనా ఆబ్కారీ శాఖ అధికారులు స్పందించి నడిగడ్డలో కృత్రిమ కల్తీ కల్లు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులు సీజ్ చేయడంతో మూతబడిన జమ్మిచేడు కల్లు దుకాణం

## అనుమతి లేని దుకాణాలే ఎక్కువ..

నడిగడ్డలో కల్లు దుకాణాలపై దాడులు చేస్తున్న కొద్ది కల్లులో వినియోగించే మత్తు పదార్థాలు లభ్యమవుతూనే ఉన్నాయి. జూలై చివరి వారంలో గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల కేంద్రంలో నిషేధిత మత్తు పదార్థాలతో కృత్రిమంగా కల్లు తయారు చేస్తున్నారని పక్కా సమాచారంతో యాంటీనార్కోటెక్ బ్యూరో దాడులు నిర్వహించడంతో కల్తీ కల్లు తయారు చేసే మాఫియా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఆ దాడుల్లో ప్రమాదకర అల్ప్రాజోలంతోపాటు శాక్రీన్ వినియోగిస్తున్నట్లు పరీక్షల్లో తేలగా అక్కడ అధికారులు కల్లు దుకాణాన్ని సీజ్ చేశారు. అదేవిధంగా ముగ్గురిపై కేసులు కూడా నమోదు చేశారు. ఆ ఘటన మరువకముందే ఆగస్టు 24న గద్వాల నియోజకవర్గ పరిధిలోని రంగాపురం, పాత పాలెంలో ని ఓ కల్లు దుకాణంలో కల్తీ కల్లు విక్రయిస్తున్నారే సమాచారంతో గద్వాల ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రెండు కిలోల నిషేధిత సీహెచ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో ఆ సమాచారాన్ని బయటకు పొక్కకుండా ఎక్సైజ్ అధికారులు గోప్యంగా ఉంచారు. చివరికి ఈ విషయం బయటకు పొక్కడంతో విధిలేని పరిస్థితిలో ఆ శాఖ అధికారులు దాడులు చేసిన మాట వాస్తవమే అని.. దొరికిన సీహెచ్‌ను సీజ్ చేయడం తోపాటు కల్లును ధ్వంసం చేసి 24 సీసాలను సీజ్ చేసి పరీక్షకు పంపినట్లు చెప్పారు. ఇక్కడ అధికార పార్టీకి చెందిన ఓ నేత కనుసన్నల్లో కల్తీ కల్లు దందా కొనసాగుతున్నట్లు తెలిసింది. అధికార పార్టీలో రెండు వర్గాలుగా చీలి ఉండడండతో ఈ కల్తీ కల్లు దందా వ్యవహారం బయటకు వస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో మొత్తం మూడు వందలకుపైగా కల్లు దుకాణాలు ఉండగా.. అందులో రాజకీయ పలుకుబడితో వందకు పైగా అనుమతి లేని కల్లు దుకాణాలు నడుస్తున్నట్లు సమాచారం. ఈ విషయం ఆ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పోలీసుల దాడుల్లో పట్టుబడిన కల్లు (ఫైల్)

## కల్లు విక్రయాలపై నార్కోటెక్ అధికారుల నిఘా..

గద్వాలలో కల్తీ కల్లు తయారీదారులపై నార్కోటెక్ అధికారులు నిఘా ఉంచారు. ఈ నెల 27న గద్వాల నియోజకవర్గంలోని గద్వాల మండలం జమ్మిచేడు, వీరాపురం, మేలచెర్వు, పూడూరు, మల్దకల్ మండలంలో ఏక కాలంలో నార్కోటెక్ అధికారులు పోలీసుల సహకారంతో కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. అక్కడ కల్లు విక్రయిస్తున్న వారి నుంచి నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఆయా గ్రామాల్లో విక్రయించే కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు కలిపినట్లు గుర్తించారు. దీంతో ఆయా కల్లు దుకాణాలో ఉన్న 200 సీసాల నిషేధిత కల్లు సీసాలను స్వాధీనం చేసుకొని నిషేధిత మత్తు పదార్థాలు కలిపి కల్లు విక్రయిస్తున్న 20 మందిపై ఎన్‌డీపీఎస్ (నార్కోటెక్ డ్రగ్ సైకోట్రోఫిక్ పదార్థాల చట్టం) కింద కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో రూ.15,600 నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



పరీక్షల కోసం కల్లు శాంపిల్స్‌ను తీసుకెళ్తున్న అధికారులు (ఫైల్)

# రైతుకు భరోసా ఏదీ?

- నీటి మూటలుగా కాంగ్రెస్ హామీలు
- వానకాలం ముగిసి.. యాసంగి వస్తున్నా అందని సాయం
- రైతు భరోసాపై ఇంకా ఖరారుకాని విధివిధానాలు
- పథకం అమలుపై కమ్ముకున్న నీలినీడలు
- పెట్టుబడుల కోసం రైతన్నల తిప్పలు
- పంట నష్టపరిహారానికి 'చేయి'చ్చిన సర్కారు

**ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానకాలం సాగు వివరాలు..**

| జిల్లా | ఆయకట్టు (ఎకరాల్లో) |
|---|---|
| నాగర్‌కర్నూల్ | 3,29,128 |
| మహబూబ్‌నగర్ | 2,44,853 |
| నారాయణపేట | 1,90,153 |
| వనపర్తి | 1,87,633 |
| జోగుళాంబ గద్వాల | 1,79,052 |



నాగర్‌కర్నూల్‌లో సాగైన వరి



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రైతుకు భరోసా ఇచ్చే చేయి కనిపించడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లలో పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అమలు చేసిన రైతు బంధు పథకం పేరు మారిందే తప్పా ఆచరణలో చేయూతను అందించడం లేదు. ప్రస్తుతం వానకాలం పంట సీజన్ కూడా ముగుస్తోంది. యాసంగి దగ్గరికి వచ్చింది. దీంతో ఈ సీజన్‌లోనైనా రైతు భరోసా అందుతుందా అనే సందేహం రైతుల్లో నెల కొంది.

రైతులకు పెట్టుబడుల సాయం ఎండమావిగా మారింది. సమైక్య పాలనలో వ్యవసాయం దండగలా మారితే బీఆర్‌ఎస్ హయాంలో తొలి సీఎం కేసీఆర్ నాయకత్వం పండుగలా మార్చింది. రైతులకు 24గంటల ఉచిత విద్యుత్, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ, కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లాంటి ఎన్నో చర్యలతో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయూతను అందించింది. ఈ క్రమంలో పది నెలల కిందట పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అటకెక్కించింది. ఎన్నికల హామీల్లో ఎకరాకు రూ.7,500చొప్పున రెండు పంటలకు ఏడాదిలో రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.5వేలు అందించింది. దీంతో కాంగ్రెస్ హామీలను నమ్మిన రైతులు అధికారం కట్టబెట్టగా రైతు భరోసా పథకం అమలవుతుందని భావించారు. అయితే గతేడాది యాసంగి సీజన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంకా విధి విధానాలు ఖరారు చేయలేదని పేర్కొన్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ రూపొందించిన రైతు బంధు పథకం మాదిరి ఎకరాకు రూ.5వేల చొప్పున అందించింది. ఆ తర్వాత ఈ వానకాలం ఆరంభంలో రైతుభరోసా అమలవుతుందని ఆశించిన రైతన్నలకు భంగపాటే మిగిలింది. రుణమాఫీ పథకాన్ని ముందుకు తీసుకొచ్చిన ప్రభుత్వం దాన్ని కూడా పూర్తిస్థాయిలో అందించలేక విఫలమైంది. ఇప్పటికీ వేలాది మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందలేదు. రైతులందరికీ రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు ప్రకటనలు చేస్తున్నా పరిస్థితి వాస్తవానికి విరుద్ధంగా ఉన్నది. ప్రస్తుతం వానకాలం పంటల సమయం కూడా దాదాపూర్తి ముగుస్తోంది. వచ్చే అక్టోబర్ నుంచి యాసంగి పంటల సీజన్ ప్రారంభం కానుంది. దీంతో ఈ సీజన్‌లోనైనా రైతు భరోసా పథకం అమలవుతుందా? అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ వానకాలంలో రైతు భరోసా పథకం అమలు కాకపోవడంతో రైతులు ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. తీరా ఈసారి కురిసిన అతివర్షాలతో పత్తి పంట బాగా దెబ్బతింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో దాదాపుగా 15 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. దీనివల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు దెబ్బతిన్న పంటలకు పరిహారం సైతం అందలేదు. ఈ క్రమంలో యాసంగి సీజన్‌లో పంటల సాగు రైతన్నల్లో పెట్టుబడుల భయాన్ని కలిగిస్తోంది. వానకాలంలో పెట్టుబడులకు చేసిన అప్పులు, దెబ్బతిన్న పంటలతో కలిగిన నష్టం ఆందోళన కలిగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకంపై విధివిధానాలను ప్రకటిస్తామని పది నెలలుగా నెట్టుకొస్తున్నది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితబంధు, పల్లె ప్రగతి, మన ఊరు-మనబడి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, న్యూట్రీషియన్ కిట్, డబుల్ బెడ్రూం ఇండ్లు, గొర్రెల పంపిణీ, అల్పాహారం లాంటి ఎన్నో పథకాలు కనుమరుగయ్యాయి. ఈ నేపథ్యంలో రైతుల కోసం 2018 నుంచి అమలైన రైతు బంధు పథకం వల్ల జిల్లాలో రూ.3.981 కోట్లు నేరుగా రైతులకు లబ్ధి కలిగించాయి. కాగా రైతు భరోసాగా పేరు మారిన కూడా అమలయ్యేనా అనే సందేహాలు రైతన్నల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

## నేడు యోగా బోధకుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 : తెలంగాణ ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో యోగా బోధకుల పోస్టుల భర్తీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 120 పోస్టులను భర్తీ చేయనున్నట్లు మహబూబ్‌నగర్ ఆయుష్‌శాఖ జిల్లా ఇన్‌చార్జి ఆదిశేషయ్య, డా.చంద్రశేఖర్, డీపీఎం సురేశ్‌నాయక్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 15 మంది పురుషులు, 15 మంది మహిళలు, వనపర్తిలో 9 మంది పురుషులు, 9 మంది మహిళలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 19 మంది పురుషులు, 19మంది మహిళలు, నారాయణపేట 8 మంది పురుషులు, 8మంది మహిళలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 9 మంది పురుషులు, 9 మంది మహిళలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలోని ఆయుష్ ఆయుర్వేద దవాఖానలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు పదో తరగతి లేదా ఇంటర్‌తో పాటు ఆరు నెలల యోగా కోర్సు సర్టిఫికెట్ ఉన్నవారు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు.

## కానిస్టేబుల్ సస్పెన్షన్

బిజినేపల్లి, సెప్టెంబర్ 29 : ఓ కేసును పరిష్కరిస్తానని ఫిర్యాదుదారుడితో లంచం తీసుకున్న ఘటనలో బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వినోద్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు సీఐ కనకయ్య తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సురేశ్ ప్రేమ వివాహం చేసుకొని తన స్వగ్రామానికి రాగా యువతి కుటుంబీకులు సురేశ్‌పై దాడిచేసి యువతిని తీసుకెళ్లారు. ఆ సమయంలో సురేశ్ 100కు డయల్ చేయగా పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చిన కానిస్టేబుల్ వినోద్‌రెడ్డి మీపై కేసు చేస్తానని బెదిరించడంతో రూ.2వేలు లంచం ఇవ్వగా కుటుంబీకులు విషయం తెలుసుకొని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

## ఆలయంలో పవిత్రోత్సవం

- జోగుళాంబ సన్నిధిలో రేపు దర్శన విరామం

అలంపూర్, సెప్టెంబర్ 29 : దక్షిణకాశీగా పేరుగాంచిన అలంపూర్ క్షేత్రంలో అక్టోబర్ 3నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో పవిత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆలయశుద్ధి కార్యక్రమం నిర్వహిస్తామని, శుద్ధిసమయంలో ఆలయాల ప్రధాన ద్వారాలు మూసి ఉంచడం వల్ల భక్తులకు దర్శన భాగ్యం ఉండదని, సాయంత్రం 6 గంటల తర్వాతే దర్శనానికి అవకాశం ఉంటుందన్నారు. భక్తులు ఈ మార్పును గమనించాలని ఈవో కోరారు.

## కృష్ణమ్మ పరవళ్లు

గద్వాల, సెప్టెంబర్ 29 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. ఎగువ నుంచి జూరాలకు 72,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. నాలుగు గేట్లు ఎత్తారు. పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గానూ ప్రస్తుతం 318.430 మీటర్లు, పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గానూ 9.480 టీఎంసీలుగా ఉన్నది. కాగా ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 500, భీమా లిఫ్ట్-1కు 750, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 విద్యుదుత్పత్తికి 38,251 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

***తుంగభద్ర డ్యాం, ఆర్డీఎస్‌కు..***

అయిజ, సెప్టెంబర్ 29 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. ఆదివారం ఇన్‌ఫ్లో 10,631 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 11,571 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠసామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.773 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1632 అడుగులు ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 13,797 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 13,150 క్యూసెక్కులు నమోదైంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 647 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా ప్రస్తుతం ఆనకట్టలో 9.3 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

***ఆల్మట్టి, నారాయణపూర్‌కు..***

కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 48,108 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 22,020 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటిమట్టం 1705 అడుగులకు గానూ 1704.69 అడుగులు ఉన్నది. గరిష్ఠనీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.01 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 19,844 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 14,225 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1614.99 అడుగులు, పూర్తి స్థాయి నీటి నిల్వ 37.40 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.64 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ

## బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని..

- ముఖంపై వేడి నూనె చల్లిన దుండగుడు
- ఇద్దరికి తీవ్ర గాయాలు

కేటీదొడ్డి, సెప్టెంబర్ 29 : బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని కడాయిలో ఉన్న వేడివేడి వంట నూనెను ముఖంపై చల్లగా.. ఇద్దరు గాయపడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నెలో చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు.. గువ్వలదిన్నెకు చెందిన బొజ్జప్పగౌడ్ బజ్జీల దుకాణం నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వినోద్ మద్యం తాగి బజ్జీలు ఉద్దెర ఇవ్వాలని గొడవ చేశాడు. అయితే, బొజ్జప్పగౌడ్ ఉద్దెర ఇవ్వనని చెప్పడంతో వినోద్ వేడి నూనె కడాయిని బొజ్జప్పగౌడ్‌పై చల్లాడు. దీంతో బొజ్జప్పగౌడ్‌తో పాటు పక్కనే ఉన్న వీరేశ్ ముఖంపై నూనె పడగా.. ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూల్ దవాఖానకు తరలించారు. వీరేశ్ భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మిట్ట ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సభ్యులు, మేము సైతం అంటూ సామగ్రిని కడుగుతున్న చిన్నారులు

## చేయి చేయి కలిపి..

- 12 వారాలుగా ఆలయాల శుభ్రం
- మన ఊరు-మన గుడి పేరిట నిర్వహణ

పెబ్బేరు, సెప్టెంబర్ 29 : పెబ్బేరులో హిందూ జాగృతం సభ్యులు చేపట్టిన వినూత్న కార్యక్రమం మన ఊరు-మన గుడి ఆదివారం మిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించారు. ప్రతి వారం మున్సిపాలిటీ పరిధిలోని ఒక గుడిని శుభ్రం చేసి సంప్రోక్షణ చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమం 12 వారాలుగా కొనసాగుతున్నది. సుమారు వంద మంది సభ్యులు గల బృందం ఆలయం గర్భగుడి, విగ్రహాలు, పరిసరాలను శుభ్రం చేయడమే గాక, అవసరమైన చోట రంగులు వేశారు. ఈ సారి చిన్న పిల్లలు కూడా కార్యక్రమంలో భాగస్వామ్యులై తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడం విశేషం.